కథ

"ఓ.కే. బెస్టాఫ్ లక్" గంట చప్పుడు వింటూనే ఫిజిక్స్ లెక్చరర్ తన బుక్స్ తీసుకుని బయటికి నడిచాడు. ఆరోజుకి అదే లాస్ట్ పీరియడ్. బహుశా చాలామంది కాలేజీ జీవితాలకి కూడా.

# పెళ్ళి నాకే కానీ...

## ఎం.నాగలక్ష్మి

స్టూడెంట్స్ అంతా గోలగోలగా ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకుంటూ బయటికి వస్తున్నారు. మర్నాటి నుండీ ప్రిపరేషన్ హాలిడేస్ పరీక్షలు రాయడానికి కాలేజీకి వస్తే చాలు. అప్పుడు అందరితో కలవడం అవుతుందో లేదో అని చాలామంది విష్ చేసుకుంటూ వీడ్కోలు తీసుకుంటున్నారు.

"ఏయ్ దీపా! ఏమిటీ ఫెవికాల్ పెట్టి అతికించినట్టు బెంచీకి ఫిక్సయిపోయావ్. ఇంటికి వెళ్ళాలని లేదా లేకపోతే కాలేజీ వదలాలని లేదా?" రమ్య ఫ్రెండ్స్‌తో మాటలు ముగించుకుని దీప దగ్గరకు వస్తూ అంది.


దీప నిరాసక్తంగా రమ్యవైపు చూసింది మాట్లాడుతున్నది తనతో కాదన్నట్టు. రమ్యకి చటుక్కున గుర్తు వచ్చింది దీప ఏం ఆలోచిస్తోందో.

"గేటు దగ్గర నీ ప్రాణం ఎదురు చూస్తూ వుంటుంది. లే... లే... ఇంకా అలాగే కూర్చున్నావేమిటి 'ఓ మేరా జాన్... తూహి మేరా జాన్' అని వెళ్ళి అల్లుకుపోయేదాన్ని నేనయితే, పాపం నీ వెంటపడి మతి పోగొట్టుకున్నాడు పిచ్చి జాన్. నువ్వేమో 'ఊ' అనవు 'ఆ' అనవు" దీప కళ్ళలో వస్తున్న నీటిపొర చూసి టక్కున ఆగిపోయింది రమ్య.

క్లాస్‌రూం అంతా ఖాళీ అయిపోయింది. వాళ్ళిద్దరే మిగిలారు. "ఏం నిర్ణయం తీసుకున్నావు?" రమ్య దీప పక్కనే కూర్చుంటూ అడిగింది. మూడేళ్ళ పరిచయమే అయినా రమ్య, దీప ప్రాణస్నేహితులు. ఒకే వీధిలో వుండటమే కాక ఇద్దరి మధ్యా దూరపు బంధుత్వం కూడా వుండటంతో ఒకళ్ళ గురించి ఒకళ్ళకి పూర్తిగా ఫ్యామిలీ వివరాలతో సహా తెలుసు. దీప ఎలాంటి సందిగ్ధావస్థలో ఉందో రమ్య ఊహించగలదు.

"దీపా... బి బ్రేవ్.. నీ మనసుకి నచ్చిన నిర్ణయం తీసుకో. మిగిలిన పరిస్థితులు వాటంతట అవే బాగుపడతాయి".

దీప పేలవంగా నవ్వింది. ఏం బాగుపడతాయి. దివ్య ఇంట్లోంచి వెళ్ళి మూడేళ్ళు దాటుతోంది. ఇంట్లో దివ్య పేరు ఇంతవరకూ ఎవరూ ఉచ్ఛరించలేదు. పరిస్థితులు ఏం బాగుపడ్డాయి?"



రమ్య ఒక్క క్షణం ఏం మాట్లాడలేకపోయింది. "అవును ఏ మార్పూ లేదు... దీపా! మా ఇంట్లో ఎప్పుడు దీపం వెలిగిస్తావు. జాన్ నాకంతా రాశారు. ఇది నీ జీవితం. నీ జీవితం మీద నిర్ణయం తీసుకునే అధికారం ఇంకొకరికి ఇవ్వకు. అదీ నీ మనసుకి నచ్చనిదైతే... నీ జీవితంలో వెలుగు నింపుకుని మా ఇంట్లో కూడా వెలుగు నింపుతావని ఆశిస్తాను. మొదట్లో మా అమ్మా, నాన్నల వగ్గరనుంచి కూడా కాస్త వ్యతిరేకత ఉండొచ్చు. కానీ అవన్నీ సర్దుకుపోతాయి. నీ మనసుకి నచ్చిన నిర్ణయం తీసుకో. నీ నిర్ణయం ఏదైనా మనం స్నేహితులమని మర్చిపోకు! ఆ స్నేహం కలకాలం అలాగే వుంటుంది సుమా" మేరీ ఉత్తరం కళ్ళలో కదలాడింది.

ఈరోజు తను నిర్ణయం తీసుకునే తీరాలి. జాన్ కోసమే కాదు... అమ్మా నాన్నల కోసం కూడా. బహుశా శశిధర్ కోసం కూడా. దీపం వెలుగునిస్తుంది. కానీ పరిసరాలని వేడెక్కిస్తుంది. ముట్టుకుంటే కాలుతుంది. తను వెలుగునిచ్చే దీపమా? కాల్చే దీపమా? తన నిర్ణయం రెండిళ్ళని ప్రభావితం చేస్తుంది. ఒకింట్లో అది ఆరని మంట.

రమ్య దీప వంక జాలిగా చూసింది. దివ్య, దీప స్కూల్ మాస్టారు నాగభూషణంగారి అమ్మాయిలు. మగపిల్లలు లేరు అన్న భావన లేకుండా కూతుళ్ళనే కొడుకులు అనుకుని వాళ్ళ ఇష్టప్రకారం స్వేచ్ఛగా పెంచాడు.

"ఆడపిల్లలు అణుకువగా వుండాలి. ఆ డ్రెస్ ఏమిటి? ఆ జుట్టు కత్తిరింపులేమిటి? ఇరవై ఏళ్ళు దాటినా ఇంకా ఏం చదువు పెళ్ళి చెయ్యరా?" అంటూ వసుంధరమ్మ సణుగుతున్నా ఆవిడ నోరు నొక్కేసేవాడు.

"కాలంతోపాటు మనమూ వుండాలి. పిల్లలు మనలాగే ఉండాలనుకోకు" అంటూ ఆట పట్టించేవాడు. దివ్య ఎమ్మెస్సీ పూర్తి చేసి లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరింది. దివ్య తన కొలీగ్ సంజయ్‌ని పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు వసుంధరమ్మతోపాటు నాగభూషణంగారు కూడా ప్రా... డిపోయారు. మొదటిసారిగా తమ దివ్యకి ఎక్కువ ... నిచ్చాడేమో అన్పించింది నాగభూషణంగారికి. ఆడపిల్లని హద్దుల్లో ఉంచక తప్పు చేశాననుకున్నాడు. తాను ఇచ్చిన స్వేచ్ఛని దుర్వినియోగం చేస్తోందన్న కోపం వచ్చింది ...

చెప్పబోయాడు.

చిన్నప్పటినుంచీ ఆడింది ఆటగా పాడింది పాటగా ఎంతో ముద్దుగా తను డాన్స్ అంటే డాన్స్, కరాటే అంటే కరాటే ఏది కావాలంటే అది చేసిన తండ్రి పెళ్ళి విషయంలో అడ్డు తగలటం దివ్యకీ నచ్చలేదు. చిన్న చిన్న విషయాల్లో, అదీ తనకి తెలిసీ తెలియని వయసులో ఏది అడిగినా కాదనని తండ్రి, మంచీ చెడూ ఆలోచించగలిగే వయసొచ్చి, పెళ్లి గురించి తను ఆలోచించి తీసుకున్న నిర్ణయం కాదనడం... అదీ కులమతాలు మానవజాతి ఎదుగుదలకి అడ్డుగోడలు అని పాఠాలు చెప్పే మాస్టారు... కులం కారణంగా సంజయ్‌ని అల్లుడిగా అంగీకరించకపోవడం దివ్యని రెచ్చగొట్టాయి. తల్లితండ్రుల్ని ఎదిరించి మూడేళ్ళ క్రితం సంజయ్‌ని పెళ్ళి చేసుకుంది దివ్య. వసుంధరమ్మా, నాగభూషణంగార్లు దివ్య అనే కూతురు ఉండేదని మర్చిపోయారు. లేదా మర్చిపోయామనుకుంటున్నారు. ప్రస్తుతం వాళ్ళకి దీప ఒక్కర్తే కూతురు. అదే ఊళ్లో ఉన్నా దివ్యని ఆ ఇంటి గడప తొక్కనివ్వలేదు. ఇప్పుడు దీప మళ్ళీ అదే పరిస్థితుల్లో ఉంది. రమ్య దీప మనసులో చెలరేగుతున్న తుపాన్‌ని అర్థం చేసుకోగలుగుతోంది. ఒకవైపు అమ్మా నాన్నా, ఇంకోవైపు చిన్ననాటి స్నేహితురాలి అన్నయ్యా, పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటానని చేయి అందిస్తున్న జాన్. దీపకి జాన్‌కన్నా ఉత్తముడూ, యోగ్యుడూ లభించడం దాదాపు అసాధ్యం. జాన్ సివిల్ సర్వీసెస్‌లో సెలక్టయి ట్రైనింగ్‌కి వెళ్ళబోతున్నాడు. అతని తండ్రి డాక్టర్ డేవిడ్. చాలా సహృదయుడు. ఊళ్ళో పేరు మోసిన డాక్టర్. ఏదో ఒక కుటుంబానికి దూరం కాక తప్పని స్థితి.

"దీపా! ఇలా ఎంతసేపు కూర్చుంటాం. జాన్ ఎదురు చూస్తూ వుంటాడు" రమ్య, దీపని చేయిపట్టుకుని లేవదీసింది.

జాన్ బైక్ పక్కగా నిలబడి వాళ్ళకోసం చూస్తున్నాడు.

"నాకు ఇంకొక్కరోజు సమయం కావాలి. రేపు నాలుగు గంటలకి ఇందిరాపార్క్‌కి వస్తాం. రేపు తప్పకుండా నా నిర్ణయం తెలియజేస్తాను" దీప జాన్‌తో చెబుతూంటే రమ్య విస్మయంగా చూసింది. ఒక్కరోజులో ఏం మారుతుంది. ఏం ఆలోచిస్తుంది. ఇన్నాళ్ళూ ఏం చేస్తోంది మరి.

"ఓకే. నా ప్రయాణానికి ఇంక వారమే వుంది. రేపు తప్పకుండా మీ నిర్ణయం తెలియజేయండి. ఏదైనా సరే" జాన్ బైక్ ఎక్కి చెయ్యి వూపి వెళ్ళిపోయాడు.

రమ్య, దీప వంక తిరిగి "రేపటిగా ఏమవుతుందే?"

"రమ్యా, నేను దివ్య దగ్గరికి వెళ్లాలనుకుంటున్నాను. మా అమ్మతో ఫ్రెండ్ ఇంటికి వెళ్ళానని చెప్తావా?"

దీప అంతర్యం అర్థమయింది రమ్యకి. "నో ప్రాబ్లెం. చెబుతాకానీ, ఎక్కువ సేపు చెయ్యకుండా వచ్చెయ్యి" రమ్య అంటూండగానే దీప అటుగా వచ్చిన ఆటో ఆపి ఎక్కి కూర్చుంది. రమ్య మెల్లగా బస్టాండ్‌వైపు నడిచింది.

* * *

తలుపు తీసి దివ్య- ఎదురుగా వున్న దీపని చూసి ఆశ్చర్యపోయింది. ఆనందంతో కౌగిలించుకుంది. "ఇన్నాళ్ళకి గుర్తు వచ్చానా దీపా... అమ్మా నాన్నా సరే, నువ్వైనా మాట్లాడొచ్చుగా. అలా మొహం తిప్పుకుని వెళ్ళిపోతే ఎంత బాధగా అన్పించిందో?" దివ్య కళ్ళు నజలాలయ్యాయి.

"అమ్మ పక్కన ఉంది అప్పుడు. ఇంక ఎలా మాట్లాడను. అమ్మా నాన్నలకి భయపడి, వాళ్ళని బాధపెట్టడం ఇష్టంలేక రాలేకపోయాను. అవునూ, బాబు ఏడీ" దివ్య దీపని బెడ్రూమ్‌లోకి తీసుకెళ్ళింది.

ఏడాదిన్నర వంశీధర్ గాఢంగా నిద్రపోతున్నారు. వాడి నిద్ర చెడకుండా వంగి నుదుటిమీద ముద్దుపెట్టుకుంది దీప. "చాలా బావున్నాడు బాబు. ఏం పేరు?"

"వంశీధర్. పది నిముషాల్లో లేస్తాడు. ఎత్తుకుందువు గానీలే. రా టీ తాగుతూ కాస్సేపు మాట్లాడుకుందాం" దివ్య వంటింట్లోకి దారి తీసింది.

దివ్యవైపు పరీక్షగా చూసిన దీప ఉలిక్కిపడింది. సువర్ణంలా మెరిసే దివ్య రోల్డ్‌గోల్డ్‌లా వెలవెలాపోతోంది. మూడేళ్ళక్రితం తనకు తెలిసిన దివ్య ఈమె కాదు అనేలా వుంది. కళ్ళూ, మొహం పీక్కుపోయాయి.

"దివ్యా! చాలా చిక్కిపోయావు. ఒంట్లో బావుండటం లేదా?"

"పెళ్ళయితే ఆడవాళ్ళు ఇలాగే తయారవుతారు" దివ్య తేలిగ్గా నవ్వేసింది టీ కప్పుల్లో పోస్తూ.

"దివ్యా! బావగారు... ఆర్ యూ హ్యాపీ" ఏం అడగాలో ఎలా అడగాలో తెలియక తడబడింది.

"మీ బావగారు శ్రీరామచంద్రుడంతటి ఉత్తములు. పిచ్చి పిచ్చిగా ఆలోచించకు. రా. ముందు విశేషాలు చెప్పు"

దీప మెల్లిగా జాన్ ప్రపోజల్, తన డైలమా గురించి చెప్పింది. దివ్య రెండు నిమిషాలు మౌనంగా వుండి నిట్టూర్చింది.

"దీపా అర్థమైంది. నీ సమస్యకి సమాధానం నా జీవితంలో వెదుకుతున్నావుకదూ! కానీ దీపా పెళ్ళి ఇద్దరికీ సంబంధించిన విషయం. అయినా రెండు కుటుంబాల సభ్యుల ప్రభావం పెళ్ళి సక్సెస్ కావడానికి, ఫెయిల్యూర్ అవడానికీ తెలిసో, తెలియకో కారణం అవుతుంది. నా గురించే చెప్తా విను. మీ బావగారు ఉత్తములు. నేనంటే ఆయనకి ప్రాణం. కానీ మా అత్తగారికీ, ఆడపడచులకీ నేను ఏమీ తేకుండా వాళ్ళింట్లో చొరబడ్డాననిపిస్తుంది. సమయం చూసి మాటలతో, చేతలతో వాళ్ళు ఆగ్రహం చూపిస్తారు. ఉద్యోగం చేసి సంపాదిద్దామనుకుంటే, నేను ఇంట్లో లేకపోతే పనులు జరగవుట. అతిథి మర్యాదలు తక్కువవుతాయి అందుకని ఉద్యోగం మాన్పించారు. మా అత్తగారు మాతోటే ఉంటున్నారు. ఇవాళ ఆవిడా, మా ఆడపడుచూ మ్యాట్నీకి వెళ్ళారు. మీ బావగారు నాకోసం నాన్ వెజ్ మానుకున్నారు. మరి ఇప్పుడు అలా కుదరదు. మిగతా అందరికీ అవి కావాలి. అతిథులు వస్తే చెయ్యాల్సిందే. నేను తినకపోయినా అవన్నీ చేయటం నేర్చుకుని చేస్తున్నాను. పసివాడి నోట్లో కూడా పెడతారు. కానీ ఏమనగలను చూస్తూ వూరుకోవడం తప్ప. అమ్మా నాన్నా ఎలాగూ మా గడప తొక్కరు. ఒక్కగానొక్క కొడుకు, ఆయనని అమ్మకీ, అక్కాచెల్లెళ్ళకీ దూరం చేయలేను. సర్దుకుపోతున్నాను. అలా సర్దుకుపోతే మిగిలేది మనస్తాపం, దెబ్బలాటలు. మరీ లాగితే విడాకులు. దీపా! నీ జీవితానికి సంబంధించిన నిర్ణయం నువ్వే తీసుకోవాలి. ఇటు అమ్మా నాన్నల గురించేకాదు, అటు వాళ్ళ కుటుంబం ఎంత సహకరిస్తారు అన్నది కూడా ఆలోచించు. అందరి సహకారం ఉన్నా గుడికి కాకుండా చర్చికి వెళ్లేంత విశాల హృదయం నీదవునో కాదో తేల్చుకో!" దివ్య మాటలు వింటూ ఆలోచనలో పడింది దీప.

వంశీధర్ లేచాడు. వాడిని తీసుకొచ్చి దీపకందించింది. పది నిమిషాలు వాడితో ఆడి, దీప వెళ్ళొస్తానని చెప్పి లేచింది. తనకీ ఓ కొడుకు పుడ్తే, పవన్ అని పేరు పెడ్తానంటే జాన్ వూరుకుంటాడా? వాళ్ళ వాళ్ళు ఒప్పుకుంటారా? శనివారం గుడికి వెళ్ళే అలవాటున్న తను ఆదివారం చర్చిలో కూర్చోగలదా?

దీప ఇల్లు చేరేంతవరకూ రకరకాలుగా ఆలోచిస్తూనే వుంది. డాక్టర్‌గారి కోడలు, కలెక్టర్‌గారి భార్య. అయితే చిన్న చిన్న విషయాలు ఏం బాధించవు అన్పిస్తుంది కానీ జీవితం ఈ చిన్న విషయాల్లోనే సంతృప్తి పొందుతుందేమో?

* * *

మర్నాడు జాన్‌కి తన నిర్ణయం తెలియజేస్తూంటే దీప కళ్ళల్లో పల్చగా కన్నీటిపొర పరచుకుంది. "పెళ్ళి నాదే కానీ, నిర్ణయం నాది కాదు" అని ఆ తడికి భాష్యం చెప్పుకున్నాడు జాన్. "పిరికిది. అందిన అదృష్టాన్ని తన్నుకుంటోంది. మరింక బాధ దేనికో?" అనుకుంది రమ్య.

ఈ సమాజం, సమాజాన్ని అంటుకుని ఉన్న వ్యవస్థ మారేంతవరకూ కేవలం రెండు హృదయాల కలయిక పెళ్లికి దారితీయదు- అనుకుంది దీప.

*

